క్లుప్తంగా

26నుంచి టోర్నమెంట్

ఏటూరునాగారం: ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో ఈనెల 26 నుంచి జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు కన్నెబోయిన రాజు, సయ్యద్ వహీద్, బండారి లక్కి మంగళవారం తెలిపారు. గ్రామస్తుడైన దివంగత మాజీ సీబీఐ డైరెక్టర్, మంత్రి కాకులమర్రి విజయరామారావు జ్ఞాపకార్థం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.1200లు చెల్లించాలని, ఏ మండలం క్రీడాకారుడు ఆ క్రికెట్ జట్టులోనే ఆడాలన్నారు. డ్రెస్‌కోడ్, ఆధార్ కార్డు ఉండాలన్నారు. మొదటి బహుమతి రూ.30,016, రెండో బహుమతి రూ.20,016లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 25న డ్రా తీయడం జరుగుతుందన్నారు. సమాచారం కోసం 91827 61442, 99126 13312 సంప్రదించాలన్నారు.

బస్సు సర్వీస్ ప్రారంభం

కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్రల మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కేంద్రానికి భూపాలపల్లి ఆర్టీసీ బస్సు డిపో నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ సర్వీసు ప్రారంభమైంది. ఈనెల 20 నుంచి బీజాపూర్ టు వయా మహారాష్ట్రలోని ఆసరెల్లి, అంకీస, సిరొంచ తెలంగాణలోని కాళేశ్వరం, కాటారం, భూపాలపల్లి, వరంగల్ గుండా హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్టాండ్‌కు సర్వీసు సూపర్ లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం బీజాపూర్ నుంచి 7గంటలకు బయలుదేరి రాత్రి 9గంటలకు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి తిరిగి వస్తుందని తెలిపారు. రూ.690 పెద్దలకు, రూ.350 చిన్నపిల్లలకు టికెట్టు ధర ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్టు రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



చిట్యాల: మండలంలోని కైలాపూర్ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ అవంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు పలు రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, చిన్నారుల ఎత్తుల కొలతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



మహదేవపూర్: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ రవీంద్రనాథ్ మంగళవారం పరిశీలించారు. గన్ని సంచులకు సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పలిమెల: సీఎం కప్ క్రీడలలో భాగంగా జిల్లా స్థాయిలో పలిమెల మండలం కబడ్డీ జట్టు ఫైనల్‌లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అలాగే ఖో ఖో పోటీల్లో మండల జట్టు జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను అభినందించారు. కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మంగపేట: మండలంలోని బోరునర్సాపురం సమీపంలోని గౌరారంవాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై మల్లెల అబ్బయ్య మంగళవారం తెలిపారు. ఏఎస్సై తెలిపిన సంఘటన వివరాల మేరకు గోదావరి ఒడ్డున మిర్చి పంట సాగు చేసిన రైతు ఉదయం బహిర్భూమి కోసం వాగులోకి వెళ్లాడు. వాగులో ఓ వ్యక్తి మృతి చెంది ఉండగా విషయాన్ని గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తుల ఇచ్చిన సమాచారాన్ని పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి మాలోత్ హీరూ పోలీసులకు తెలిపారు. పోలీసులు గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఒంటిపై చారల చొక్కా, బ్లూకలర్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని ఎవరైనా మృతుడిని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్సై తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్



ఇళ్లలో స్ప్రేయింగ్ చేయిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

మంగపేట: జ్వరాలు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ అన్నారు. గత కొద్ది రోజులుగా మండలంలోని అకినేపల్లిమల్లారంలో ప్రజలు జ్వరాల బారిన పడుతుండటంతో వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వారిని పరీక్షించారు. గ్రామంలోని జనావాసాలను పరిశీలించి జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జగ్రతలపై ప్రజలకు వివరించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించుకోవాలని, జనావాసాల మధ్య మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు ఇళ్లలో స్ప్రేయింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, సబ్‌యూనిట్ ఆఫీసర్ నరసింహారావు, హెల్త్ అసిస్టెంట్ పొదెం రవీందర్, ఏఎన్ఎం సోమలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌పై జేపీఎస్‌ల హర్షం



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు

ఏటూరునాగారం: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను(జేపీఎస్) రెగ్యులరైజేషన్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో మంగళవా రం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి జేపీఎస్‌లు నాగరాజు, సతీష్, క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంతటి విజయ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఏ ఉద్యోగస్తుడికి అన్యాయం చేయరని, అందరిని ఆదుకుంటారన్నారు. సమర్థవంతంగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఎంపీడీఓ కుమార్, సీనియర్ కార్యదర్శులు రమాదేవి, జూనియర్ కార్యదర్శులు సందీప్, లక్ష్మీనారాయణ, అశోక్, హసీనా, రాజ్యలక్ష్మి, మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కేన్సర్ వైద్యశిబిరం



పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో కేన్సర్ వైద్య శిబిరం రెండవ రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా 400ల మందికి పరీక్షలు చేసినట్లు ప్రతిమ కేన్సర్ ఆస్పత్రి వైద్యులు అవినాస్, సుమిత్ర తెలిపారు. ప్రతిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు, మందులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. నేడు కూడా వైద్యశిబిరం ఉంటుదని మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున రావాలని వారు కోరారు. టెక్నీషియన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ల్యాబ్ వద్ద వేచి ఉన్న రోగులు



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అవినాష్

పరామర్శ



పరామర్శిస్తున్న గోవింద్‌నాయక్

ములుగు రూరల్: మండలంలోని జీవింతరావుపల్లి గ్రామానికి చెందిన చాతాల పోషాలు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గ్రంథాలయ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ మంగళవారం పరామర్శించారు. పోషాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు బైకాని ఓదెలు, కలాలి అనిల్, బల్గూరి నవీన్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



బాబును పరామర్శిస్తున్న ఐఈఆర్పీలు

వెంకటాపురం(ఎం): మండలానికి చెందిన ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు సంద బాబు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల అతడి తల్లి కూడా మృతి చెందింది. దీంతో బాధితుడిని సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఐఈఆర్పీలు మంగళవారం పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాత పితా వెల్ఫేర్ సొసైటీ స్థాపించి ఎందరో ఒంటరి మహిళలకు, వితంతువులకు, దివ్యాంగులకు, అనాథ పిల్లలకు, వృద్ధులకు ఆశ్రయం కల్పించిన బాబు అనారోగ్యంతో ఉండగా అతని తల్లి మృతిచెందడం బాధకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు సుమ, సుమన్, సుబ్బారెడ్డి, రమేష్, గంగాధర్, రవి, రమేష్ సీఆర్పీలు కుమార్ పాడియా, దేవేందర్, కంప్యూటర్ ఆపరేటర్ విష్ణు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కరుణాకర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ భారత రాజ్యాంగంపై అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శరత్, ప్రవీణ్, సాయి, తరుణ్, నరేందర్, ఎల్లేష్, కిషోర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

మల్హర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు కళాశాలలో చేర్పించడానికి అధ్యాపకులు తాడిచర్ల గ్రామంలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరితే ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా మంచి విద్యతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు అవగాహన కల్పించారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత ఎంసెట్ శిక్షణ ఇస్తున్నట్లు విద్యార్థులకు వివరించారు.

బిల్ట్ కాలనీలో నిత్యం చోరీలు!



సామగ్రి ఎత్తుకు పోతున్న దొంగలు

మంగపేట: మండలంలోని కమలాపురం బిల్టు కాలనీలో చోరీల పర్వం నిత్యకృత్యంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంవత్సర కాలంగా మూతపడిన ఫ్యాక్టరీలోని కోట్ల రూపాయల విలువైన భారీ మోటార్లు, యంత్రాల విడిభాగాలు, పలు రకాల మిషనరీ దొంగల పాలయిన విషయం తెలిసిందే. దీంతో పాటు కాలనీలోని గెస్ట్ హౌజ్, ఆస్పత్రి, క్వార్టర్స్‌లోని విలువైన ఫర్నీచర్, డోర్లు సైతం ఎత్తుకు పోడంతో ఖాళీ అయ్యాయి. చోరీలు చేస్తున్న వారిని ఎవరుకూడా పట్టించుకోక పోవడంతో నిత్యం దొంగలు కాలనీలోని క్వార్టర్స్‌లో ఉన్న ఏఒక్క వస్తువును వదలడం లేదు. క్వార్టర్స్‌లోని సామానులు, కిటికీలు, ఇనుప వస్తువులు, మంచాలు తదితర వస్తువులను పట్ట పగలే ఎత్తుకు పోతున్నారు. దొంగలు చోరీకి పాల్పడి క్వార్టర్స్‌లోని సామగ్రి ఎత్తుకు పోతున్న దృశ్యాలు వాట్సాప్ గ్రూపుల్లో చెక్కర్లు కొడుతున్నాయి. పట్ట పగలు బిల్ట్ కాలనీలో చోరీలకు పాల్పడుతున్నా ఎవరుకూడా పట్టించుకోక పోవడంపై పలురకాల విమర్శలు వినవస్తున్నాయి.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

కాటారం: కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన కర్ణాటక ఎన్నికల ఇన్‌చార్జ్, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కాటారం వస్తున్న సందర్భంగా నేడు కాటారంలో చేపట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక, గెలుపులో శ్రీధర్‌బాబు చేసిన కృషి ఎనలేనిది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. మల్హర్ మండలం నాగులమ్మ నుంచి కాటారం మండల కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తెప్పెల దేవేందర్‌రెడ్డి, చీమల వెంకటస్వామి, గద్దల రమేశ్, రాజయ్య, కుంభం రమేశ్‌రెడ్డి, కిరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి: మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులకు సూచించారు. భూపాలపల్లి మున్సిపాలిటీలోని 20వ వార్డు శాంతినగర్, 17వ వార్డు సుభాష్‌కాలనీల్లో ఎమ్మెల్యే గండ్ర, అదనపు కలెక్టర్ దివాకర మంగళవారం బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీల్లో సైడ్ కాల్వలు, లింక్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరగా నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు, కౌన్సిలర్లు చల్ల రేణుక, మురళి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



కాటారం: స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



గణపురంలో..



మొగుళ్లపల్లిలో..

కాటారం: నకిలీ విత్తనాలను విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఫర్టిలైజర్ షాపు యజమానులను కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, విత్తన విక్రయ దుకాణాలను మంగళవారం పోలీస్‌శాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని విత్తనాల స్టాక్, కంపెనీ వివరాలను డీఎస్పీ పరిశీలించారు. విత్తన వ్యాపారం నిర్వహించే వ్యాపారులకు ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినట్లు దృష్టికి వస్తే ఊరుకునేది లేదన్నారు. డీఎస్పీ వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు శ్రీనివాస్, తమాషారెడ్డి, ఏఓ రామకృష్ణ ఉన్నారు.

గణపురం: రైతులకు ఎరువుల దుకాణాల యజమానులు నకిలీ విత్తనాలను అమ్మితే చర్యలు తీసుకుంటామని చిట్యాల సీఐ వేణుచందర్ హెచ్చరించారు. మండలంలోని చెల్పూరు గ్రామంలోని ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రశీదును తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై అభినవ్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: రైతులకు విత్తనాల షాపుల యాజమానులు, డీలర్లు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సతీష్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని విత్తనాల షాపును స్థానిక ఎస్సై సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. డీలర్లు రైతులకు విత్తనాలు విక్రయించిన సమయంలో పూర్తి వివరాలతో కూడిన బిల్లులు ఇవ్వాలని సూచించారు. అదే విధంగా రైతులు కూడా లైసెన్స్ కలిగిఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు సమయంలో రైతులు తప్పకుండా పూర్తి వివరాలతో కూడిన బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఎవరైన నకిలి విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహదేవపూర్: మండల కేంద్రంలోని వివిధ ఫెర్టిలైజర్ షాపులను సీఐ కిరణ్ తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జ్యోతి అగ్రీ మాల్, రైతు సేవ కేంద్రం-2 ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను మంగళవారం ఎస్సై శ్రీధర్ తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

టేకుమట్ల: ఫర్టిలైజర్ యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై చల్ల రాజు, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే షాప్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

కాటారం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధల లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని విలాసాగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టి చివరి ధాన్యం గింజను కూడా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జివాకర్‌రెడ్డి, సర్పంచ్ జనగామ రమాదేవి, వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, సీఈఓ ఎడ్ల సతీశ్ ఉపసర్పంచ్ సంతోష్‌రావు, రైతులు బాపు, రాజయ్య, రాజు, రమేశ్, మల్లయ్య, రాజయ్య పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతు చేపట్టాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న అరుణ్‌కుమార్

కాటారం: వర్షాలకు తెగిపోయిన కాటారం మండలం వీరాపూర్, గూడురు చెరువులతో పాటు మల్హర్ మండలం రుద్రారం చెరువుకు మరమ్మతు చేపట్టాలని కోరుతూ మంగళవారం గూడురుకు చెందిన బొడ్డు అరుణ్‌కుమార్, పలువురు రైతులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువులు తెగిపోయి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఇప్పటి వరకు మరమ్మతు చర్యలు చేపట్టలేదని వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. చెరువుల మరమ్మత్తు కోసం గత 15 సంవత్సరాల క్రితం మెగా కంపెనీకి కాంట్రాక్ట్ వచ్చినప్పటికీ పనులు మాత్రం మొదలు పెట్టలేదని ఆరోపించారు. రైతుల వినతితో స్పందించిన వినోద్‌కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతు చర్యలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు అరుణ్‌కుమార్ తెలిపారు.

జాతీయ సంఘాలను నిలదీయాలి

భూపాలపల్లి అర్బన్: 11వ వేతన ఒప్పందంలో సింగరేణి కార్మికులను అన్యాయానికి గురి చేసిన జాతీయ కార్మిక సంఘాల నాయకులను నిలదీయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య పేర్కొన్నారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ వేతన ఒప్పంద చర్చల్లో సింగరేణి కార్మికులను తీరని అన్యాయం జరిగిందన్నారు. 50శాతం తగ్గకుండా వేజ్‌బోర్డు అలవెన్సుల మీద పెరుగుదల ఉంటుందని తెలిపిన జాతీయ కార్మిక సంఘాలు కనీసం 30శాతం వేతనాలు కుడా పెంచలేదని ఆరోపించారు. కార్మిక సంఘాల మధ్య ఐక్యత లేకపోవడం వలనే వేతనాల పెరుగలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై కుడా ఊసేత్తలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్దన్, శ్రీనివాస్, బాబు, ప్రసాద్ రెడ్డి, శ్రీధర్, జయశంకర్‌లు పాల్గొన్నారు.